నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 24 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



పెద్దవాగులో ఎడ్లబండిలోని డ్రమ్ములో నీటిని నింపుతున్న గ్రామస్తులు



భూగర్భ జలాలు అడుగంటి నీళ్లు రాని చేతి పంపు

# మొట్లగూడ గోడు పట్టదా..!

కాంగ్రెస్ తెచ్చిన కరువు

## తాగు నీటి కోసం గ్రామస్తుల తిప్పలు

- అందని మిషన్ భగీరథ జలం
- పనిచేయని చేతిపంపులు
- కాలినడకన వెళ్లి వాగు నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం

దహెగాం, మార్చి 23 : దహెగాం మండలంలోని మొట్లగూడ గ్రామస్తులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమీటర్ దూరంలోనున్న పెద్దవాగుకు కాలినడకన.. ఎడ్లబండ్లపై వెళ్లి చెలిమెల నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ ద్వారా ఎంచక్కా నీరు సరఫరా చేయగా, ప్రస్తుత ప్రభుత్వ పట్టింపులేని తనంతో అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నది.

### పనులన్నీ వదులుకొని..

మొట్లగూడలో సుమారు 130 కుటుంబాలుండగా, 600 వరకు జనాభా ఉంది. ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడుగంటి తాగు నీటి తిప్పలు మొదలయ్యాయి. ఇక్కడ సుమారు 8 చేతిపంపులు ఉండగా, వాటిలో సరిగా నీరు రావడం లేదు. మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ పైపులైన్‌కు మరమ్మతులు చేయకపోవడంతో కాలనీలకు నీరు సరఫరా కావడం లేదు. ట్యాంక్ సమీపంలోని కొన్ని కాలనీలకు మాత్రమే నీరందుతున్నది. ప్రధానంగా బొగడ కాలనీ(ఎస్టీ) వాసులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. దిక్కుతోచని పరిస్థితుల్లో సమీపంలోని పెద్దవాగుకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నారు. కేవలం నీటిని తెచ్చుకునేందుకే రోజంతా పనులు వదులుకోవాల్సి వస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తాగు నీటి గోస తీర్చాలని వారు కోరుతున్నారు.



## తగ్గిన నీటిమట్టం.. తేలిన పాత వంతెన

దండేపల్లి, మార్చి 23 : ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గగా, ఇన్ని రోజులుగా మునిగి ఉన్న దండేపల్లి మండలంలోని గూడెం-రాయపట్నం పాత వంతెన పైకి తేలింది. గోదావరి స్నానాలకు వచ్చే భక్తులే కాకుండా, సమీప గ్రామాల ప్రజలు సరదా కోసం పాత వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన కాలినడకకు మాత్రమే శ్రేయస్కరమని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం ప్రమాదకరమని పలువురు హెచ్చరిస్తున్నారు.



తాళ్లపేట సమీపంలో 30వ డిస్ట్రిబ్యూటర్ కాలువ సిమెంట్ లైనింగ్ దుస్థితి

# కాలువలిలా.. చివరికి నీరెలా?

**శిథిలావస్థలో కడెం, గూడెం లిఫ్ట్ ప్రాజెక్టుల కాలువలు**

## పంటలకు నీరందక రైతన్నల అవస్థలు

దండేపల్లి, మార్చి 23 : కడెం ప్రాజెక్టు, గూడెం ఎత్తిపోతల పథకం కాలువలు అధ్వాన్నంగా మారాయి. పెద్ద పెద్ద బుంగలు పడి.. సిమెంట్ లైనింగ్ చెడిపోయి.. పిచ్చి మొక్కలతో నిండి పంటలకు నీరందించలేని దుస్థితికి చేరాయి.

### 20 వేల ఎకరాల్లో..

దండేపల్లి మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వరి, మక్క, ఇతర పంటలు సాగు చేశారు. ఇందులో కడెం జలాశయం, గూడెం ఎత్తిపోతల పథకం కింద సుమారు 10 వేల ఎకరాల్లో వరి, మక్క సాగు చేయగా, మిగతా 10 వేల ఎకరాలు వ్యవసాయ బావులు, చెరువులపై ఆధారపడి పంటలు వేశారు. గూడెం ఎత్తిపోతల పథకం నుంచి డీ-30 ద్వారా తానిమడుగు నుంచి సాగు నీరు అందించే కాలువలు పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉన్నాయి. నెల్కివెంకటాపూర్ శివారు నుంచి అందుగులపేట వరకు పంటలకు సాగునీరందించే కాలువలు సిమెంట్ లైనింగ్ చెడిపోయి కనిపిస్తున్నాయి. దీంతో నీరంతా వృథాగా పోతున్నది. దండేపల్లి శివారులోని పంట పొలాలకు వెళ్లే డీ-28 కాలువ పరిస్థితి అధ్వానంగా మారింది. చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. తాళ్లపేట శివారులో డీ-24 వద్ద కాలువల సిమెంట్ లైనింగ్ చెడిపోయి సైడ్ వాల్ దెబ్బతినడంతో సాగు నీరు రాక పంటలు ఎండిపోతున్నాయి.



దెబ్బతిన్న తానిమడుగు 30వ డిస్ట్రిబ్యూటర్ కాలువ సిమెంట్ లైనింగ్

### వారానికి మూడు రోజులు..

ప్రస్తుతానికి వారబంధీ విధానం కొనసాగుతున్నది. వారానికి మూడు రోజులు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం వరి, మక్క కంకి దశలో ఉన్నందున నీరు ఎక్కువగా అవసరముంటుంది. కానీ, కాలువల పరిస్థితి ఇలా ఉండడంతో సాగునీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. అధికారులు ఇప్పటికైనా మేల్కొని శిథిలావస్థకు చేరుకున్న కాలువలకు మరమ్మతులు చేసి పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

### నీళ్లు వృథాగా పోతున్నాయి



కడెం జలాశయం నుంచి పంట పొలాలకు నీరందించే కాలువలు పాడైపోయాయి. తూముల పరిస్థితి అధ్వానంగా ఉంది. సిమెంట్ లైనింగ్ దెబ్బతిని నీళ్లు వృథాగా పోతున్నాయి. చివరి వరకు నీళ్లు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

**- గోపతి మల్లేశ్, మాకులపేట**

### మరమ్మతులు చేపట్టాలి



కడెం జలాశయం, గూడెం ఎత్తిపోతల పథకం కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడక్కడా కాలువలకు బుంగలు పడ్డాయి. చేతికొచ్చే సమయంలో పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

**-ఉస్మాన్‌ఖాన్, తాళ్లపేట**

# సినీ హీరో సాయికుమార్‌కు కుమ్రం భీం జాతీయ అవార్డు

- ఆసిఫాబాద్‌లో అట్టహాసంగా ప్రదానోత్సవం
- సినీనటులు బాబు మోహన్, శివారెడ్డి, రాజ్ మోహన్ సందడి
- పాల్గొన్న ప్రముఖులు




హీరో సాయికుమార్‌కు కుమ్రం భీం జాతీయ అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వహణ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎంపీ నగేశ్, కలెక్టర్, ఎస్పీ, భీం మనుమడు సోనేరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్/ఆసిఫాబాద్ టౌన్, మార్చి 23 : జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్స్‌లో కుమ్రం భీం జాతీయ అవార్డు ప్రదానోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. భారత్ కల్చరల్ అకాడమీ, ఓం సాయి తేజ ఆర్ట్స్, ఆదివాసీ సాంస్కృతిక పరిషత్ సంయుక్తంగా 12 ఏళ్లుగా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ఈ అవార్డును అందిస్తుండగా, 2024 సంవత్సరానికిగాను సినీహీరో సాయి కుమార్‌ను ఎంపిక చేశారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్వహణ కమిటీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ పార్థసారథి, విశిష్టాతిథులుగా ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, మాజీ మంత్రి, హాస్య నటుడు బాబు మోహన్, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి, నటుడు రాజ్‌మోహన్, కుమ్రం భీం మనుమడు సోనేరావు, నిర్వహణ కమిటీ కో చైర్మన్ దండనాయకుల నాగబాల సురేశ్‌కుమార్, కన్వీనర్ అర్జు మాస్టర్, యువ నిర్మాత నక్క రాహుల్ యాదవ్ హాజరయ్యారు. అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు. మెమెంటో ఇచ్చారు. రూ. 50 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ కుమ్రం భీం పోరాటం స్ఫూర్తిదాయకమని, జల్.. జంగల్.. జమీన్ కోసం పోరాడి ఆదివాసుల ఆరాధ్య దైవం అయ్యారని కొనియాడారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఐటీడీఏ పీవోగా పనిచేశానని, జిల్లాలో అనేక సహజ వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివాసుల సంస్కృతి గొప్పదని, దానిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సినీ హీరో సాయికుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎన్నో అవార్డులు అందుకున్నానని, ఇప్పుడు కుమ్రం భీం జాతీయ అవార్డు అందుకున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ కుమ్రంభీం పేరిట అవార్డులు అందజేయడం అభినందనీయమన్నా రు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ కుమ్రం భీం పేరిట సినీ ప్రముఖులకు జాతీయ అవార్డులు అందించడం గిరిజన జాతికి గర్వ కారణమన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 55 శాతం అడవులు ఉన్నాయని, ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేసి సినిమా షూటింగ్‌లు చేసుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. మాజీ మంత్రి, హాస్య నటుడు బాబు మోహన్, మిమిక్రీ ఆర్టిస్ట్ శివా రెడ్డి మాట్లాడుతూ కళాకారుల సేవలను గుర్తించి అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. శివా రెడ్డి మిమిక్రీ ఆకట్టుకుంది. సినీ నటుల రాకతో జిల్లా కేంద్రం సం దడిగా మారింది. అంతకుముందు జిల్లా కేంద్రంలోని అంకమ రాజు దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోవ లక్ష్మి తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సినీ ప్రముఖులను సన్మానించారు. మాజీ జ డ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీ పీ మల్లికార్జున్, నిర్వహణ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రామారావు, సాయిని రాజశేఖర్, రాధా కృష్ణాచారి, శేఖర్ ఉన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**మాజీ మంత్రి బాబు మోహన్**

రెబ్బెన, మార్చి 23 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రెబ్బెన మండల కేంద్రంలో వ్యాపారవేత్త కొలిపాక కిరణ్‌కుమార్-పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు మగవారికి సమానంగా పోటీ పడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, అసెంబ్లీ కన్వీనర్ సో ల్లు లక్ష్మి, మండలాధ్యక్షుడు మల్రాజు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గులబం చక్రపాణి, జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, నాయకులు గోలెం తిరుపతి, ఓదెలు, సుగుణాకర్, మల్లేశ్, సచిన్‌జైస్వాల్, నవీన్‌గౌడ్, గణేశ్, తిరుపతి, కనకయ్య ఉన్నారు.



రెబ్బెనలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి బాబుమోహన్

# జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

నస్పూర్, మార్చి 23: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, కనపర్తి రమేశ్ తెలిపారు. ఆదివారం వారు క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. క్రీడాకారులు జుమిడి కార్తీక్, శ్యామ్, సిద్ధార్థ్ ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారని, ఈ నెల 24 నుంచి 30వరకు బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పీడీలు రోజా, వరకుమారి, రాజయ్య, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా, కోచ్ అరవింద్, కళ్యాణ్ అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న గోనె శ్యాంసుందర్‌రావు, రమేశ్

## నేటి నుంచి వాలీబాల్ పోటీలు

కౌటాల, మార్చి 23 : పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు సీఐ రమేశ్, ఎస్ఐ మధుకర్ ఆదివారం తెలిపారు. ఎస్పీ అధ్యక్షతన, కాగజ్‌నగర్ డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

# కాలం చెల్లిన యంత్రాలు పొంచి ఉన్న ప్రమాదాలు



భూగర్భ గనిలో ఎస్‌డీఎల్ యంత్రంతో ఉత్పత్తి తీస్తున్న కార్మికుడు(ఫైల్)

- భూగర్భ గనుల్లో అనుమతుల్లేకుండా అదనపు యంత్రాలతో ఉత్పత్తి
- లక్ష్యం కోసం కార్మికుల ప్రాణాలతో చెలగాటం
- ఆర్కే-5 గనిలో పై కప్పు కూలి కూరుకుపోయిన ఎస్‌డీఎల్
- ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని కార్మికుల డిమాండ్

శ్రీరాంపూర్, మార్చి 23 : సింగరేణిలోని భూగర్భ గనుల్లో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను వినియోగిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలనే తపనతో కాలం చెల్లిన వాటిని వాడుతుండగా, ప్రమాదం జరిగినప్పుడు మాత్రం కార్మికులు, మైనింగ్ స్టాఫ్‌పై అధికారులు నిందవేసి చేతులు దులుపుకుంటున్నట్లు తెలుస్తున్నది.

### లెక్కకు మించి యంత్రాలతో..

సింగరేణిలో 20 భూగర్భ గనులుంటే.. ఒక్క శ్రీరాంపూర్‌లోనే 7 గనులున్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలోని గనుల్లో బొగ్గు ఉత్పత్తి అధికంగా చేయాలనే లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా లెక్కకు మంచి ఎస్‌డీఎల్ యంత్రాలను నడిపిస్తున్నారు. అధికారికంగా కేటాయించిన ఎస్‌డీఎల్ యంత్రాలతో మాత్రమే ఉత్పత్తి తీస్తే లక్ష్యాలను చేరుకోలేమని అధికారులే పేర్కొనడం గమనార్హం.

### ఆర్కే-5లో కూరుకుపోయిన ఎస్‌డీఎల్

స్థానిక ఆర్కే-5 గనిలో శనివారం మొదటి బదిలీలో పై కప్పు కూలి ఎస్‌డీఎల్ (కాలం చెల్లిన) యంత్రం పూర్తిగా తీయలేని స్థితిలో కూరుకుపోయింది. గనిలో 3వ సీమ్, 16వ లెవల్ ఉత్పత్తి పని స్థలంలో ఎస్‌డీఎల్ యాక్టింగ్ కార్మికుడు రమేశ్ ఉత్పత్తి పనులు కొనసాగిస్తున్నాడు. బొగ్గు రవాణాకు సరైన టబ్బులు లేక పోవడంతో ఎస్‌డీఎల్ యంత్రాన్ని ఆపి వేశాడు. గని పై కప్పు శబ్దాన్ని గమనించి వెంటనే కొద్ది దూరంలోకి వెళ్లి వేచి చూస్తుండగా.. ఒక్క సారిగా పై కప్పు కూలిపోయింది. కార్మికుడు తేరుకొని చూసే సరికి ఎస్‌డీఎల్ యంత్రం కనిపించకుండా బొగ్గు పెల్లల కింద కూరుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, కార్మికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఎస్‌డీఎల్ యంత్రాన్ని బయటకు తీయలేని విధంగా ఉందని, అక్కడ ఉత్పత్తి పనులు కూడా చివరి దశకు వచ్చినట్లు మేనేజర్ సుధీర్‌కుమార్ జా పేర్కొన్నారు. కాగా, అధికారులు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలనే తపనతో.. యాజమాన్యం మెప్పుకోసం కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను వినియోగిస్తున్నారని, ఈ విధానం మార్చుకోవాలని కార్మికులు కోరుతున్నారు. ఇక ఆర్కే-5గనిలో జరిగిన ప్రమాదంపై మైనింగ్ ఇన్‌స్పెక్టర్లు (డీజీఎంఎస్), అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.